క్లుప్తంగా

జాతరకు భారీ బందోబస్తు

ఏసీపీ పురుషోత్తంరెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ జాతర 19నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా ఆలయం వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. గురువారం ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జాతర ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. మూడు నెలలపాటు జరిగే మూడు చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటుచేసి భక్తులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. వాహనదారులు రోడ్డుపై వాహనాలను నిలుపకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఆలయం వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ చంద్రమోహన్, ఆలయ ఈఓ రవికుమార్, సిబ్బంది మహేందర్‌రెడ్డి, రమేష్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



నాయకులను సన్మానిస్తున్న ఎంపీ

గజ్వేల్‌రూరల్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వివిధ మండలాలకు నూతనంగా నియామకమైన అధ్యక్షులు హైదరాబాద్‌లో గురువారం ఆయనను కలిశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్, కుకునూర్‌పల్లి అధ్యక్షుడు సంపత్ రెడ్డి, కొండపాక అధ్యక్షుడు సత్యం, తూప్రాన్ అధ్యక్షుడు జానకిరామ్, మనోహరాబాద్ మండల అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు 'సీఆర్‌పీ' కౌన్సెలింగ్



మాట్లాడుతున్న యాదగిరి

వర్గల్(గజ్వేల్): సంచారజీవనమైనా సరే బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల క్లస్టర్ రీసోర్స్‌పర్సన్ యాదగిరి అన్నారు. పిల్లల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వారం క్రితం మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ప్రాంతానికి చెందిన పలువురు సంచారజీవులు ప్లాస్టిక్ సామగ్రి విక్రయించుకునేందుకు వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లికి వచ్చారు. వారితో పాటు మధ్యలో బడిమానేసిన ముగ్గురు బడీడు పిల్లలున్నారు. ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ సర్వే కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన వారిని గుర్తించారు. జీవనం కోసం ఎక్కడికి వెళ్లినా పిల్లలను అక్కడి స్కూల్స్‌లో చేర్పించాలని సూచించారు.

సంప్రదాయ వంటల ప్రదర్శన



పిండి వంటలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం తెలంగాణ సంప్రదాయ పిండివంటల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భిక్షపతి మాట్లాడుతూ సంప్రదాయ పిండివంటలలో అనేక పోషకవిలువలు ఉన్నాయన్నారు. అరిసెలు, నువ్వు ఉండలు, చకినాలు, పప్పుగారెలు లాంటివి తయారు చేయడం నేర్చుకోవడమే కాకుండా వాటిని తినాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, అధ్యాపకులు చంద్రమౌళి, బాలరాజు, నైనా దేవి, సభి ఫాతిమా తదితరులు ఉన్నారు.

ఆశుపద్య కవిత కార్యక్రమం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక హరిహర రెసిడెన్సీకాలనీ ఆవరణలోని లలితా చంద్రమౌళీశ్వర ఆలయ మాసోత్సవాల్లో భాగంగా ఆశుపద్య కవితా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు పండరి రాధాకృష్ణ, కవి ఉండ్రాళ్ల రాజేశం గురువారం తెలిపారు. 18న ఆలయ మాసోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. అష్టావధాని బండకాడి అంజయ్య ఆశుపద్య కవితలు చెప్తారని, కవులు, రచయితలు, సాహితీ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యాప్‌ల పేరుతో బురిడీ

'కోస్టా', 'బోరల్' ద్వారా ప్రచారం

- పళ్లు, ఐస్‌క్రీమ్‌ల వ్యాపారం అంటూ దందా
- లక్షలు సంపాదించవచ్చని నమ్మబలికి మోసం
- పెట్టుబడి పెట్టి మోసపోయిన బాధితులు

బాగా డబ్బు సంపాదించాలన్న తపన ప్రతి ఒక్కరిలోను ఉంటుంది. అలాగని ఏ కష్టం లేకుండా డబ్బురావడం సాధ్యమవుతుందా అంటే అవుననే నమ్మిస్తున్నారు. తక్కువ కాలం, పెట్టుబడితో అధిక మొత్తంలో సంపాదించాలనే వారి కోరికను ఆసరాగా తీసుకొని కొందరు ఘరానా మోసగాళ్లు ఆన్‌లైన్ మోసానికి పాల్పడుతున్నారు. యాప్‌ల పేరుతో డబ్బు దోచుకుంటున్నారు.

చేర్యాల(సిద్దిపేట): పట్టణంతోపాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో కోస్టా, బోరల్ యాప్‌ల ద్వారా వ్యాపారం, అధిక లాభాలు అంటూ ప్రచారం జోరుగా సాగుతోంది. పళ్లు, ఐస్‌క్రీమ్ లాంటి తినుబండారాల వ్యాపారమని, పెట్టుబడి పెడితే రోజువారీ మంచి లాభాలు వస్తాయని పెట్టుబడులు కోరుతున్నారు కొందరు మోసగాళ్లు. తమ ఖాతాల్లో మొదటు డబ్బులు జమకావడంతో పెట్టుబడి పెట్టేవాళ్ల సంఖ్య జోరుగా పెరిగింది.

రూ.1.16 లక్షలు మాత్రమే..

ఈ యాప్‌లో రూ.570 నుంచి పెట్టుబడి మొదలవుతుంది. దానికి కూడా ఒక లిమిట్ పెట్టడం గమనార్హం. ఒక్కరి పేరు మీద అత్యధికంగా రూ.1.16 లక్షలు మాత్రమే తీసుకుంటారు. పెట్టిన పెట్టుబడికి వచ్చే లాభం ప్రతి రోజూ ఖాతాలో జమ చేశారు. పెట్టుబడులను ఆకర్షించే ప్రక్రియలో భాగంగా యాప్‌లో చేరిన మొదటి రోజుల్లో వ్యాపారంలో అధిక లాభాలు వచ్చాయని, ఎక్కువ మొత్తం లాభాన్ని ఖాతాలో జమచేశారు. దీంతో అత్యాశకు పోయిన కొందరు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులచేత కూడా యాప్‌లలో పెట్టుబడులు పెట్టించారు.

రూ.3 కోట్లకు పైగా

ఈ యాప్‌లలో పట్టణానికి చెందిన సుమారు 50 మందికి పైగా చేరగా మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి 100కు పైగా పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. గడిచిన నెల రోజుల్లో చేర్యాల ప్రాంతంలో రూ.3కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. 'బోరల్' అనే యాప్ పేరుతో కూడా పెట్టుబడులు సేకరిస్తున్నట్లు సమాచారం. యాప్‌లో యువత, వ్యాపారస్తులే కాకుండా గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు కూడా పెట్టుబడులు పెట్టి మోసపోయినట్లు చెబుతున్నారు.



యాప్‌కు సంబంధించిన దృశ్యాలు


66 ఎవరూ ఫిర్యాదు చేయలేదు

యాప్‌ద్వారా మోసపోయినట్లు బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదు. ఎవరైనా ఉంటే వెంటనే 1930కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేస్తే ఆ డబ్బులు ఫ్రీజ్‌చేస్తారు. యాప్‌లో చేర్పించిన వారి వివరాలు, ఆధారాలతో ఫిర్యాదుచేస్తే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తాం. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి.

\- ఎల్.శ్రీను, సీఐ, చేర్యాల

అంతా ఆన్‌లైన్

వ్యాపారమంతా ఆన్‌లైన్‌లోనే సాగుతుంది. ఎక్కడా నగదు రూపంలో పెట్టుబడుల సేకరణ ఉండదు. ఒకరి నుంచి మరొకరికి మొబైల్ లింక్ ద్వారా 'యాప్'ను పంపించి రిజిస్టర్ చేస్తారు. తద్వారా ఒక ఖాతా తెరుస్తారు. ఖాతాకు పాస్‌వర్డ్ సెట్ చేయిస్తారు. యాప్‌లో డబ్బులు వేయాలన్నా, జమైన లాభం తెలుసుకోవాలన్నా యాప్ ఓపెన్‌చేసి పాస్‌వర్డ్ ఎంట్రీచేస్తే అన్ని లావాదేవీలు కనిపిస్తాయి. ఈ యాప్‌ల్లో పెట్టుబడి పెట్టిన వారికి మూడు రోజులుగా యాప్ ఓపెన్ కావడంలేదు. దీంతో పెట్టిబడి పెట్టిన వారంతా మోసపోయామని గుర్తించి చేసేదేమీ లేక, బయటకు చెప్పుకోలేక బాధపడుతున్నారు.



ఎలా ఎంట్రీ కావాలో చూపే స్క్రీన్ షాట్

పారదర్శకంగా అర్హుల ఎంపిక

మున్సిపల్ చైర్ పర్సన్ రజిత

హుస్నాబాద్: ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా ఎంపిక చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం పాలకవర్గ సభ్యుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24 వరకు వార్డు సభల ద్వారా పథకాల కోసం అర్హుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ సభల ద్వారా కౌన్సిలర్లు, వార్డు అధికారులు ప్రజల సమక్షంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. పేద ప్రజలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. చాలా మంది రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు పెట్టుకున్నప్పటికీ జాబితాలో పేర్లు రాలేదని, పేర్లు రానివారు మున్సిపల్ కార్యాలయంలో తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సి పల్ కమిషనర్ మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ అనిత, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ప్రక్రియ

సిద్దిపేటఅర్బన్/హుస్నాబాద్/బెజ్జంకి(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. సిద్దిపేట అర్బన్ మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో తహసీల్దార్ సలీమ్ పర్యటించారు. అర్హులకు అన్యాయం జరగనీయొద్దని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మార్టిన్ లూథర్, డిప్యూటీ తహసీల్దార్ ఉదయశ్రీ, పంచాయతీ కార్యదర్శి, ఏఈఓ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ రేషన్ కార్డుల సర్వేను పర్యవేక్షించారు. 21 నుంచి ప్రతి వార్డులో వార్డుసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ శంకర్, వార్డు ఆఫీసర్ శారద ఉన్నారు. బెజ్జంకి మండలంలో మండల ప్రత్యేక అధికారి మధుసూదన్, ఎంపీడీఓ అంజయ్య, ఎంపీఓ మంజుల, ఏఓ సంతోష్ పరిశీలించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలి

జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి

కొమురవెల్లి(సిద్దిపేట): యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కోరారు. మండలంలోని అయినాపూర్‌లో మాజీ సర్పంచ్ చెరుకు రమణా రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్రీడల ముగింపు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు తనకు నచ్చిన క్రీడలో నైపుణ్యం కనబర్చాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ శ్రీను, ఎస్‌ఐ రాజు, మండల ప్రధానకార్యదర్శి సనాది భాస్కర్, చేర్యాల మండల అధ్యక్షుడు కొమ్మురవి, మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, జంగని రవి, తురాయి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

నిబంధనలతోనే ప్రమాదాలు దూరం



సిద్దిపేటజోన్: అవగాహన కల్పిస్తున్న సీఐ వాసుదేవరావు

- పోలీసు అధికారుల పిలుపు
- పలుచోట్ల అవగాహన కార్యక్రమాలు

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పలు మండలాల పరిధిలో ఆయా పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి వాహనదారులకు గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పిలుపునిచ్చారు.

సిద్దిపేటజోన్/దౌల్తాబాద్(దుబ్బాక)/గజ్వేల్‌రూరల్/దుబ్బాకటౌన్/తొగుట(దుబ్బాక)/తొగుట(దుబ్బాక)/హుస్నాబాద్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/సిద్దిపేటఅర్బన్: సిద్దిపేటలోని ఇస్లామియా కళాశాల చౌరస్తాలో వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, రాంగ్ రూట్ డ్రైవింగ్ నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. మండల పరిధిలోని ఉప్పరిపల్లిలో తొగుట సీఐ లతీఫ్ మాట్లాడారు. నిబంధనలు పాటించని వారు శిక్షార్హులన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీరామ ప్రేమ్‌దీప్, హెడ్ కానిస్టేబుల్ విక్రమ్, గ్రామస్తులు పాల్గొన్నారు. గజ్వేల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఐ సైదా, ట్రాఫిక్ సీఐ మురళి వేర్వేరు కార్యక్రమాలలో మాట్లాడారు. యువత చెడువ్యసనాలకు బానిసలు కావద్దని, వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. దౌల్తాబాద్ మండలం ఉప్పర్‌పల్లిలో తొగుట సీఐ లతీఫ్, రాయపోల్ మండల కేంద్రంలో ఎస్‌ఐ రఘుపతి అలాగే అవగాహన కలిగించారు. ఆయా కార్యక్రమాలలో దౌల్తాబాద్ ఎస్‌ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్, రాయపోల్ ఏఎస్‌ఐ దేవయ్య, సిబ్బంది పాల్గొన్నారు. తొగుటలో ప్రొబేషనరీ ఎస్‌ఐ అరుణ్ ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం తాగి ఆటోలు నడపవద్దని సూచించారు. హుస్నాబాద్ మార్కెట్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుధాకర్ మాట్లాడారు. సిద్దిపేటలోని లారీ అసోసియేషన్ కార్యాలయం వద్ద, డ్రైవర్‌లు, యజమానులకు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అవగాహన కల్పించారు. నిబంధనలకు విరుద్ధంగా లారీలను పార్కింగ్ చేయవద్దని సూచించారు. సిద్దిపేటఅర్బన్‌లోని రంగదాంపల్లి శివారులో లారీ అసోసియేషన్ ఆఫీస్ వద్ద త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ లారీ డ్రైవర్లకు, యజమానులకు అవగాహన కల్పించారు. దూరప్రాంతాలకు వెళ్లే లారీ డ్రైవర్లు నిద్ర మత్తులో లారీ నడపవద్దన్నారు. పోలీస్ సిబ్బంది, లారీ యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



సిద్దిపేటఅర్బన్: లారీ యజమానులు, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న త్రీటౌన్ సీఐ విద్యాసాగర్



దుబ్బాకటౌన్: మాట్లాడుతున్న సీఐ లతీఫ్, సిబ్బంది

భూముల పరిశీలన

జగదేవ్‌పూర్(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట)/హుస్నాబాద్‌రూరల్/సిద్దిపేటఅర్బన్/మిరుదొడ్డి(దుబ్బాక)/సిద్దిపేటరూరల్/దౌల్తాబాద్(దుబ్బాక): రైతుభరోసా పథకంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అధికారులు వివిధ మండలాల్లో సాగుకు అనువుకాని భూముల పరిశీలన ప్రక్రియను గురువారం ప్రారంభించారు. జగదేవ్‌పూర్ మండలంలో తహసీల్దార్ కృష్ణమోహన్ వివిధ గ్రామాలను సందర్శించారు. గుర్తించిన భూములను 21 నుంచి 24 వరకు గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలో చదివి వినిపిస్తామని చెప్పారు. ఆయన వెంట ఏఓ వసంతరావు, కార్యదర్శిలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. చిన్నకోడూరు మండల పరిధిలోని ఇబ్రహీంనగర్, మేడిపల్లి, మల్లారం శివారులో రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. తహసీల్దార్ జయలక్ష్మి, ఎంపీడీఓ జనార్దన్, ఎంపీఓ సామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ పాల్గొన్నారు. హుస్నాబాద్ రూరల్‌లో నాగారం గ్రామంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ రమేష్, ఏఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలంలో ప్రత్యేక అధికారి ఏడీఏ పద్మ ఆధ్వర్యంలో ఎన్సాన్‌పల్లిలో పర్యటించారు. కార్యక్రమంలో మండల ఏఓ శ్రీనాథ్, ఏఈఓ నవనీత, ఆర్‌ఐ నర్సింహులు, పంచాయతీ కార్యదర్శి నర్సింగరావు పాల్గొన్నారు. మిరుదొడ్డి మండలంలోని ధర్మారంలో మండల వ్యవసాయ అధికారి మల్లేశం సర్వే నిర్వహించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు కొండల్‌రెడ్డి, సుదర్శన్, ఏఈఓలు ఉన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని సీతారాంపల్లి, రాఘవాపూర్, పుల్లూరు, బుస్సాపూర్, రావూరుకుల గ్రామాల్లో తహసీల్దార్, ఏఓ నరేశ్ భూములను పరిశీలించారు. సర్వేలో ఏఈఓ సుమిత్ర పాల్గొన్నారు. దౌల్తాబాద్ మండలంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఏఈఓ సంతోష్, ఎంపీఓ గఫూర్, సీఐ నాగరాజు తదితరులు సర్వే చేశారు.



జగదేవ్‌పూర్(గజ్వేల్): అలిరాజ్‌పేటలో భూములను గుర్తిస్తున్న అధికారులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మండల పరిధిలోని దొమ్మాట జిల్లా పరిషత్ పాఠశాలలో 2003-2004బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. స్థానిక వీఆర్‌ఆర్ గార్డెన్‌లో వారంతా కలుసుకొని సందడి చేశారు. చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

\- దౌల్తాబాద్(దుబ్బాక)



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సమస్యలు పరిష్కరించండి



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరులు, కళాకారుల కుటుంబాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. దోమ చంద్రకళ భర్త పోచయ్య మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను గురువారం జేఏసీ నాయకులు పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు.

పోరాటపటిమకు నిదర్శనం లచ్చవ్వ

ప్రజాగాయకుడు అందె శ్రీ

మద్దూరు(హుస్నాబాద్): సాయుధ రైతాంగ పోరాటంలో రజాకార్‌లకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ పోరాట పటిమకు నిదర్శనంగా జంగిటి లచ్చవ్వ నిలిచారని ప్రముఖ కవి, ప్రజాగాయకుడు అందె శ్రీ కొనియాడారు. లచ్చవ్వ మరణించడంతో గురువారం భైరాన్‌పల్లిలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో రజాకార్లను ఎదుర్కోవడంలో ఆనాటి భైరాన్‌పల్లి గ్రామస్తుల పోరాటస్ఫూర్తి అందరినీ ఆకర్షించిందన్నారు. అందులో లచ్చవ్వ తెలంగాణ ప్రజలకు ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఆమె మరణం రాష్ట్ర ప్రజలకు తీరనిలోటని, యువత ఆమెను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.



లచ్చవ్వ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అందెశ్రీ

సంక్షిప్త వార్తలు

◆ 2న 'జాసాప' వార్షికోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జాతీయ సాహిత్య పరిషత్ 38వ వార్షికోత్సవం ఫిబ్రవరి 2న నిర్వహిస్తున్నారని, దానిని విజయవంతం చేయాలని పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐత చంద్రయ్య పిలుపునిచ్చారు. సిద్దిపేటలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రచనలతో ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి 38 వసంతాలుగా కృషిచేస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు ఎన్నవెళ్ళి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండాళ్ళ రాజేశం, చీకోటి రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ మహ్మద్ షాదుల్లాకు సన్మానం

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని గాజులపల్లికి చెందిన మహ్మద్ షాదుల్లాను గ్రామస్తులు గురువారం ఘనంగా సన్మానించారు. ఆయన ఇటీవల వికసిత్ భారత్‌లో భాగంగా యంగ్ లీడర్స్ డైలాగ్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయనను గాజులపల్లి బీఆర్ఎస్ నాయకుడు పంజా స్వామి శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో ప్రేమ్, నరేష్, రాజు, చందు పాల్గొన్నారు.

◆ సోషల్‌మీడియా బాధ్యుడిగా నరేశ్

దుబ్బాక: జాతీయ మాలమహానాడు సోషల్‌మీడియా రాష్ట్ర కార్యవర్గ బాధ్యుడిగా కాల్వ నరేశ్‌ను నియమించారు. జాతీయ అధ్యక్షుడు దయాకర్, రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, పొలిట్‌బ్యూరో చైర్మన్ శ్రీరాములు గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. నరేశ్‌ను నాయకులు సన్మానించారు. లింగం, ఆస చిన్నముత్యం, ఆస స్వామి, రమేష్, ఆస రాజశేఖర్, లచ్చపేట నర్సింహులు, పల్నాటి రాజు, బక్కులు తదితరులు ఉన్నారు.

◆ హామీల అమలులో ప్రభుత్వం విఫలం

తొగుట(దుబ్బాక): ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంరెడ్డి ఆరోపించారు. వెంకట్రావుపేటలో గురువారం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం యాసంగి వరి నాట్లు పూర్తికావస్తున్నా రైతు భరోసా జాడే లేదన్నారు. పింఛన్లు రూ4వేలు, భూమిలేని కూలీలకు ఏటా రూ.12వేలు అందించి ఆదుకుంటామని ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మల్లన్న సాగర్ కాల్వలను పూర్తిచేసి పంటలకు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

◆ 19న మందకృష్ణ రాక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వెయ్యి గొంతులు.. లక్ష డప్పుల మహా ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ అగ్రనేత మందకృష్ణ మాదిగ 19న సిద్దిపేటకు రానున్నారని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పెర్క పరశురాములు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయిన ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రదర్శనలో భాగంగా మందకృష్ణ జిల్లాల్లో పర్యటిస్తున్నట్టు చెప్పారు. శ్రీనివాస్, యాదగిరి, సామ్రాట్ ప్రకాశ్, లక్ష్మణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఐపీఎల్ క్రికెట్ టోర్నీ



ట్రోఫీని అందుకుంటున్న విన్నర్ టీమ్ సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నైపుణ్య ఆర్గనైజేషన్ చైర్మన్ ఐలయ్య నేతృత్వంలో నిర్వహించిన ఐపీఎల్ క్రికెట్ టోర్నీ గురువారం ముగిసింది. విన్నర్‌గా నిలిచిన మిరుదొడ్డి, రన్నర్‌గా నిలిచిన మల్లుపల్లి టీమ్‌లకు ట్రోఫీలతో పాటు నగదు పురస్కారాలను అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బాల్‌నర్సింహులు, నాయకులు సిద్ధి భూపతి గౌడ్, టోర్నీ నిర్వాహకులు ధర్మారం కుమార్, గంజి కొండల్‌రెడ్డి, విజయ్‌కుమార్, హరివిష్ణు పాల్గొన్నారు.